క్లుప్తంగా

14న బండలాగుడు పోటీలు

కొడంగల్: బండలాగుడు పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ కోరారు. శుక్రవారం సాయంత్రం ఎంపీపీ అధ్యక్షతన వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ నెల 14న జాతర సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ప్రచారం చేసి, పోటీపట్ల రైతులకు అవగాహన కల్పించి, పోటీలో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, రత్నం, మధు, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, మురహరి వశిష్ట, రాంరెడ్డి, బాల ప్రకాశ్, శ్రీనివాస్, తూం వెంకటయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

దౌల్తాబాద్: హైదరాబాద్ తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు కోరారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభలో పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ మేనిఫెస్టోను ఆవిష్కరిస్తారని వెల్లడించారు. సమావేశంలో నాయకులు వీరన్న, వెంకట్‌రెడ్డి, దస్తప్ప, వెంకట్రాములు, రాములు రెడ్డిశ్రీనివాస్, వెంకటప్ప, నర్సింలు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న రాజేందర్‌రెడ్డి తదితరులు

యాలాల: మండల కేంద్రంలో శుక్రవారం మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజేందర్‌రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. మొదటి రోజు గ్రామస్తులకు తాగునీటితో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా నారాయణరెడ్డి గ్రామస్తులకు సుపరిచితుడని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో సామాజిక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కోఆప్షన్ సభ్యుడు అక్బర్ బాబా, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోలు నాగయ్య, ఉపాధ్యక్షుడు చిన్న, గొల్ల చందు, శేఖర్, గంతల మైనొద్దీన్, సుధాకర్ గుప్తా, రాజురెడ్డి, లాలప్ప ఉన్నారు.

కష్టపడే వారిని గుర్తించాలి



యాలాల: గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపు కోసం అహర్నిషలు కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ యువజన విభాగం నాయకుడు, అగ్గనూరు వీరేశం కోరారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరుతున్న వారి విషయంలో కాంగ్రెస్ పెద్దలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొందరు స్వార్థ రాజకీయాలు, ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లోకి వస్తున్నారని అనుమానం వ్యక్తంచేశారు. అలాంటి నాయకుల పట్ల ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టి సారించి, నిజమైన కార్యకర్తలను గుర్తించాలన్నారు.

మసీదు విస్తరణకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గౌసన్

కొడంగల్: మక్కా మసీదు విస్తరణ పనులకు మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎమ్ గౌసన్ శుక్రవారం భూమి పూజ చేశారు. ముస్లింల సౌకర్యార్థం ప్రార్థనాలయ ఆవరణలో పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో షాకిర్ ఖాద్రి, అబ్దుల్ ఖయ్యూం, కరీం అశ్రఫి, షేక్ అదిల్, అహ్మద్ ఖాన్, సలీమ్, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సన్మానం

కొడంగల్: కొడంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య, జాయింట్ సెక్రటరీ కృష్ణం రాజు, స్పోర్ట్స్ అండ్ అథారిటీ కార్యదర్శి రాములును శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. వారం రోజుల క్రితం బార్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు రమేష్‌బాబు, ఎరన్‌పల్లి శ్రీనివాస్, మాసాని వెంకటయ్య, భీంరాజు, శేఖర్, ప్రవీణ్, బలరాం, మల్కప్ప లక్ష్మణ్, వెంకట్ న్యాయవాదులకు సన్మానం చేశారు.



సన్మానం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



పరిగి: జగ్జీవన్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు



కొడంగల్: నివాళులర్పిస్తున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ తదితరులు



తాండూరు టౌన్: మున్సిపల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో

స్ఫూర్తిప్రదాత.. జగ్జీవన్ రామ్

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి ప్రదాత అని వక్తలు అన్నారు. జగ్జీవన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు సకల జనులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. పేదరికంలో పుట్టిన జగ్జీవన్.. సుదీర్ఘకాలం పార్లమెంటు సభ్యుడిగా పనిచేశాడని తెలిపారు. వ్యవసాయ, కార్మిక, రక్షణ తదితర శాఖల్లో మంత్రిగా పనిచేసిన ఆయన.. తనదైన ముద్రవేసుకున్నారని గుర్తుచేశారు. అంతే కాకుండా.. కులరహిత సమాజం కోసం జీవితకాలం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. - సాక్షి, నెట్‌వర్క్



మోమిన్‌పేటలో..



దౌల్తాబాద్‌లో..



అనంతగిరి: వికారాబాద్‌లో నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు



అనంతగిరి: చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు



అనంతగిరి: కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి



నవాబ్‌పేటలో..



తాండూరు టౌన్: ప్రజాసంఘం ఆధ్వర్యంలో..



పెద్దేముల్ మండల కేంద్రంలో..



అనంతగిరి: బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ తదితరులు



దోమలో.. అంబేద్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు



మర్పల్లి: కోట్‌మర్పల్లిలో జగ్జీవన్ చిత్ర పటాలను అందజేస్తున్న బీజేఆర్ నాయకులు ఎలియాస్

సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్

యాలాల: మత సామరస్యాన్ని పెంచేలా ఇఫ్తార్ విందులు దోహదపడతాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జామ మసీదు ఆవరణలో రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న వారికి ఖర్జూర పండ్లు తినిపించి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇలాంటి విందులు సోదర భావాన్ని పెంపొందిస్తాయన్నారు. అనంతరం ఇఫ్తార్ ఏర్పాటు చేసినందుకు కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, రాపోలు నాగయ్య, బుర్నపురి నర్సింహులు, లాలప్ప, మైనార్టీ నాయకులు యూసుఫ్, మైనొద్దీన్, జిలానీ, బషీర్, అహ్మద్ తదితరులు ఉన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

కుల్కచర్ల: వేసవి తాపం నుంచి రక్షణ పొందేందుకు కూలీలు ఓఆర్ఎస్ ప్యాకెట్లను నీటిలో కలుపుకొని తాగాలని వైద్యురాలు మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్‌లు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేసే వారికి ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్వరూప, పద్మ, యాదమ్మ, సత్యమ్మ, అంబుబాయి, బాలమణి, సునీత, స్వరూప, లావణ్య, జయమ్మ, పుష్ప, మంజుల, రాధ, అంజమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రజల జీవన విధానమే 'పల్లె దరువు'

కుల్కచర్ల: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధి బండవెల్కిచర్లలో శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో 'పల్లె దరువు' జానపద గేయాల సీడీ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి పడగాల నర్సింలు మాట్లాడారు. గ్రామీణ ప్రాంత పల్లెప్రజల జీవన విధానాన్ని తెలియజేసేలా పాటలను రూపొందించి, ప్రజలకు చేరువ చేసేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మెపా గౌరవ అధ్యక్షుడు జగన్ మోహన్, స్థానిక నాయకులు చంద్రలింగం, వెంకటయ్య, గోవర్ధన్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు



స్వామివారి రథోత్సవం

శోభాయమానంగా కల్యాణోత్సవం

కుల్కచర్ల: శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. మండల పరిధి బండవెల్కిచర్ల రామలింగేశ్వర దేవస్థానంలో గురువారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా జరిగింది. శుక్రవారం తెల్లవారు జామున భక్తజనం మధ్య స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్ పర్సన్ నర్సమ్మ, ఈఓ సుధాకర్, పాలకమండలి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

పాతది వదిలేసి.. కొత్తది ఆపేసి!

బూత్ బంగ్లాను తలపిస్తున్న గెస్ట్‌హౌస్

- శిథిలావస్థలో నిజాం అతిథిగృహం
- సర్కారు ఆస్తుల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యం
- ప్రజాధనం దుర్వినియోగం

నిజాం కాలం నాటి ఆస్తులు ప్రభుత్వం పరం అయ్యాయి. కానీ వాటిని పరిరక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేశారు. వినియోగం మరిచారు. ఫలితంగా అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉపయోగంలో ఉంచి, తగిన నిధులు వెచ్చించి మరమ్మతులు చేసినట్లయితే.. అవి ప్రజాసేవకు ఉపయోగ పడేవి. అలాంటి చర్యలు చేపట్టక పోవడంతో పాడుబడిన బంగ్లాల్లా దర్శనమిస్తున్నాయి.



పొదల మధ్య ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్

ధారూరు: నిజాం హయాంలో వసతి గృహం, రెవెన్యూ సెక్టార్ కార్యాలయం.. ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. అనంతరం రెవెన్యూ కార్యాలయాన్ని పోలీస్ స్టేషన్‌గా, వసతిగృహాన్ని పోలీస్ క్వార్టర్‌గా మార్చారు. పీఎస్‌ను హైదరాబాద్-తాండూర్ ప్రధాన రోడ్డుకు తరలించడంతో.. ఈ రెండు భవనాలు ఖాళీ చేశారు. తరువాత వాటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి వృథాగా మారాయి. ఇది గమనించిన ఒక తండాకు చెందిన వ్యక్తి నాటి అతిథిగృహాన్ని నివాస గృహంగా మార్చుకున్నారు. ఆ తర్వాత అతడి నుంచి అధికారులు విడిపించి వృథాగా వదిలివేశారు. ప్రస్తుతం ఆ భవనం చెక్కుచెదరకున్నా తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ దెబ్బతిన్నాయి. ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. గోడలపై చెట్లు మొలిచి పాడుబడిన బంగ్లాను తలపిస్తోంది.

కొత్త గృహం నిర్మాణం

నాటి భవనం గురించి ఏ మాత్రం ఆలోచన చేయకుండా.. గత ప్రభుత్వం.. రెండేళ్ల క్రితం హైదరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డు పక్కనే ధారూరు చౌరస్తా సమీపంలో ఓ గుంతలో వసతిగృహం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ నిధులతో రోడ్డుకు సమాంతరంగా సీసీ బెడ్‌లతో నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం ఈ నిర్మాణం వానాకాలంలో నీటితో నిండిపోయి ఉంటుంది. దీనిని ఇటీవల గమనించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్.. ఇది ఎందుకు నిర్మించినట్లు అని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ (పీఆర్) అధికారులను ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఈ గృహానికి రూ.10 లక్షలు వెచ్చించారు. ఇది పూర్తి కావాలంటే మరో రూ.35 లక్షల వరకు అవుతుందని పంచాయతీరాజ్ శాఖ అంచనా వేసింది. ఇదే విషయాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పీకర్ తగిన చొరవ తీసుకుని, పురాతన భవనంతో పాటు అసంపూర్తి నిర్మాణంలో ఉన్న అతిథిగృహ నిర్మాణం పూర్తిం చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు కోరుతున్నారు.



హైదరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డు పక్కన నిర్మాణ దశలో ఆగిన వసతిగృహం

'మాదిగలకు అన్యాయం'

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మా మాదిగ ఆరోపించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాట్లాడారు. సీఎం.. తన సీటును కాపాడుకునేందుకు మాలలతో కుమ్మక్కయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కాదని, కేవలం రెడ్లు, మాలలదేన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ సీటును స్థానికేతరుడికి కేటాయించడం బాధాకరమన్నారు. 17 ఎంపీ స్థానాల్లో నాలుగు శాతం లేని రెడ్లకు ఆరు సీట్లు ఏవిధంగా కేటాయిస్తారని ప్రశ్నించారు. 50 శాతం పైగా ఉన్న బీసీలకు రెండు కేటాయించడం, 12శాతం ఉన్న మాదిగలకు అసలు ఒక్క సీటు ఇవ్వకపోవటం దారుణమన్నారు.

అతివకు అండగా షీటీం

- ఆపద వస్తే.. 100కు డయల్ చేయండి
- తాండూరు డీఎస్పీ బాల కృష్ణారెడ్డి

యాలాల: బాలికలు, మహిళలు వేధింపులకు గురైతే వెంటనే షీ టీంకు సమాచారం ఇవ్వాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధి టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఆడవారి రక్షణ విషయంలో పోలీసులు కఠినంగా ఉంటారని తెలిపారు. ఎవరైనా వేధిస్తే 100 లేదా 181కి డయల్ చేయాలని తెలిపారు. సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలని, అనవసర లింకులు ఓపెన్ చేయరాదని సూచించారు. బాల్య వివాహాలు, సైబర్ క్రైం, మానవ అక్రమ రవాణా తదితర విషయాలను డీఎస్పీ వివరించారు. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాలతో జిల్లాలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు షీ టీం సభ్యులు తెలిపారు. అనంతరం రూరల్ సీఐ అశోక్ కుమార్.. పోక్సో, నిర్భయ కేసుల గురించి వివరించారు. విద్యార్థుల రక్షణ, రక్షణ చట్టాల గురించి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో షీ టీం ఇన్‌చార్జి శేఖర్, మమత, కళాజాత బృందం అశోక్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

పంచలింగేశ్వర ఆలయంలో పూజలు

చేవెళ్ల: మల్కాపూర్ గ్రామంలోని భువనేశ్వరి సహిత పంచలింగేశ్వర, నవగ్ర, పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేక మహోత్సవ పూజాకార్యక్రమాలు శుక్రవారం కొనసాగాయి. ఉదయం 8 గంటలకు స్వస్తివాచనము, ప్రధాన దేవతాపూజలు, నవగ్రహ, మాతృక, యోగిని, వాస్తు, క్షేత్రపాలక, బ్రహ్మాదిమండల దేవతామంత్ర హవనములు, మూలమంత్ర హవనములు, హారతి పంచసూక్త హవనము, చండీ హోమం, దుర్గాసప్తశతి పూజలు కొనసాగాయి. శనివారం చివరి రోజు జగద్గురువులు ఆదిశంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతీ మహాస్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించనున్నారని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

కొనసాగుతున్న పోచమ్మ జాతర

మాడ్గుల: మండల పరిధిలోని అవురుపల్లి గ్రామ సమీపంలోని పోచమ్మ తల్లి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అవురుపల్లి, నల్లవారిపల్లి పరిసర గ్రామాల ప్రజలు వనవాస కార్యక్రమాన్ని నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని మామిడాకుల తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. మాజీ ఉప సర్పంచ్ రామచంద్రి, సీనియర్ నాయకుడు లాలయ్యగౌడ్, గ్రామస్తులు యాదయ్య, విజయ భాస్కర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.